
andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3 ; కనిష్ఠం 16.4

ఆంధ్రజ్యోతి



నిజామాబాద్
జిల్లా వార్తలు
5
శుక్రవారం 3 జనవరి 2025



• నవీపేటలో సన్నరకాల వరి పంటను సాగుచేస్తున్న రైతులు

సన్నాలకే రైతుల మొగ్గు

- జిల్లాలో సన్నరకాల వరిసాగుకే మొగ్గు చూపుతున్న రైతులు
- ప్రభుత్వం పంటలకు బోనస్ చెల్లిస్తుండడంతో జోరుగా సాగు
- వరి సాగు విస్తీర్ణంలో 75 శాతం వరకు సన్నరకాలు సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా
- ధర వస్తుండడంతో సన్నాలను సాగు చేస్తున్నామన్న రైతులు

నిజామాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో సాగు నీటి వసతి ఉండటంతో రైతులు వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. మెజార్టీ రైతులు ఈ యాసంగిలో సన్నరకాలను సాగు చేస్తున్నారు. జిల్లాలో సాగయ్యే మొత్తం వరి విస్తీర్ణంలో 75శాతం వరకు ఈ సన్నరకాలను సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. డిమాండ్ ఉండటం, ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ఎక్కువ మంది రైతులు సన్నరకాల సాగును కొనసాగిస్తున్నారు. దొడ్డు రకాలను తగ్గించడంతో పాటు దిగుబడి తక్కువగా ఉన్న సన్నరకాలను వేస్తున్నారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయడంతో ఎక్కువ మొత్తంలో వరినాట్లను కొనసాగిస్తున్నారు. గుత్ప, అలీసాగర్‌తో పాటు ఇతర ఎత్తిపోతల పథకాల కింద కూడా వరిపంటను వేస్తున్నారు. ఆరుతడి పంటలైన ఎర్రజొన్న, మొక్కజొన్నను తగ్గించిన రైతులు వరిసాగు కొనసాగిస్తున్నారు. యాసంగిలో నీటి అవసరం ఎక్కువగా ఉండటం, భూగర్భ జలాలపై ఒత్తిడి అధికంగా ఉన్నా.. కూలీల అవసరం తక్కువగా ఉండటంతో ఎక్కువ మంది రైతులు ఈ పంటను వేస్తున్నారు. ప్రభుత్వం బోనస్ కూడా ఇస్తుండటంతో తమకు కలిసి వస్తుందని వరిలో సన్నరకాలనే ఎక్కువగా సాగు చేస్తున్నారు.

ముందుగానే ఆరుతడి పంటల సాగు

జిల్లాలోని రైతులు మొక్కజొన్న, ఎర్రజొన్న, శనగ, జవార్‌తో పాటు ఇతర ఆరుతడి పంటలను ముందే సాగు చేశారు. గత నెలరోజుల నుంచి వరిసాగు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఈ వరిపంటను వేస్తున్నారు. ఈ యాసంగిలో జిల్లా అంతా 5లక్షల 18వేల 112 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 3లక్షల 20వేల 895 ఎకరాల్లో ఈ పంటలను వేశారు. వీటిలో ఆరుతడి పంటలు నెలన్నర క్రితమే వేశారు. జిల్లాలో మొక్కజొన్న 24,083 ఎకరాల్లో సాగు చేశారు. శనగ 16,540 ఎకరాల్లో వేయగా ఎర్రజొన్న 31,048 ఎకరాల్లో వేశారు. జవార్ 884 ఎకరాలు, నువ్వులు 8,239 ఎకరాలు, పొద్దుతిరుగుడు 2,790 ఎకరాలు, సోయాబీన్ 1043, పొగాకు 1759 ఎకరాల్లో వేశారు. వీటితో పాటు ఇతర ఆరుతడి పంటలను కూడా సాగు చేశారు.

4లక్షల 20వేల ఎకరాల్లో వరిసాగుకు అంచనా

జిల్లాలో నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల ద్వారా సాగునీటిని విడుదల చేస్తుండటంతో రైతులు వరిసాగుకే మొగ్గు చూపారు. ఈ ప్రాజెక్టులతో పాటు గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల కిందనే కాకుండా చెరువులు, కుంటలు, బోరుబావుల కింద కూడా వరిపంటను వేస్తున్నారు. ఈ యాసంగిలో 4లక్షల 20వేల ఎకరాల్లో వరిపంట వేస్తారని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో అన్ని మండలాల పరిధిలో ఇప్పటి వరకు 2లక్షల 34వేల 220 ఎకరాల్లో ఈ పంటను వేశారు. గడిచిన వారం రోజుల నుంచి ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదల కొనసాగుతుండటంతో పంటల సాగును పెంచారు. ఈ ప్రాజెక్టు పరిధిలోని లక్ష్మి, కాకతీయ కాలువల ఆయకట్టుతో పాటు చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఆయకట్టు పరిధిలో కూడా వరిసాగు కొనసాగిస్తున్నారు. గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల కింద ఈ పంటలను వేస్తున్నారు. ఇవేకాకుండా చెరువుల కింద పంటల సాగు కొనసాగిస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల పరిధిలో లక్షా 75వేల పైగా బోరుబావులు ఉండటంతో వీటి పరిధిలో ఈ పంటల సాగు కొనసాగిస్తున్నారు. జిల్లాలో వానాకాలంలో అన్ని ప్రాజెక్టులతో పాటు చెరువులు నిండటం వల్ల భూగర్భ జలాలు ఎక్కువగా ఉండటంతో రైతులు వరిసాగు వైపు మొగ్గు చూపుతున్నారు. గడిచిన నాలుగైదు సంవత్సరాల నుంచి ఎక్కువగా కూలీలు దొరకకపోవడంతో రైతులు వరివైపు మొగ్గు చూపుతున్నారు. ఆరుతడి పంటలు వేస్తే కూలీల అవసరం ఎక్కువగా ఉండటంతో వరిసాగుకు తక్కువ అవసరం ఉండటం వల్ల రైతులు ఈ పంటను ఎక్కువగా వేస్తున్నారు. జిల్లాలో సాగు చేస్తున్న మొత్తం వరి విస్తీర్ణంలో ఎక్కువ మొత్తంలో సన్నరకాలనే వేస్తున్నారు. గడిచిన కొన్నేళ్లుగా సన్నరకాలకు డిమాండ్ పెరగడం, విదేశాలకు సన్నబియ్యం ఎగుమతి అవుతుండటం వల్ల ధర వస్తుండటంతో రైతులు ఈ పంటను వేస్తున్నారు. సన్నాలు సాగు చేస్తున్న రైతుల నుంచే మిల్లర్లు, వ్యాపారులు నేరుగా కొనుగోలు చేస్తున్నారు. మద్దతు ధరకు మించి ధర పెట్టి ధాన్యాన్ని తీసుకుంటున్నారు. ఈ సంవత్సరం నుంచి ప్రభుత్వం కూడా సన్నరకాలు పండించే రైతులకు క్వింటాలుకు 500 బోనస్ ఇస్తుండటంతో ఈ యాసంగిలో ఎక్కువ మంది రైతులు సన్నరకాలనే వేస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉండటం వల్ల రైతులు ఈ పంట వేస్తున్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున సన్నాలు సాగు అవుతుండటం వల్ల ఏప్రిల్ వరకు నీటి డిమాండ్ ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కొన్నేళ్లుగా కూలీలు దొరకడం లేదు..

: గోవర్ధన్‌రెడ్డి, రైతు నవీపేట



కొన్నేళ్లుగా వ్యవసాయానికి అవసరమైన కూలీలు దొరకడం లేదు. ఆరుతడి పంటలు వేస్తే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరిపంట సాగు చేస్తే ఎక్కువగా ఇబ్బందులు లేవు. నాట్లు వేసే సమయంలో తప్ప ఇతర సమయాల్లో కూలీల అవసరం అంతగా లేదు. మిగతా పంటలలతో పోలిస్తే తక్కువగా ఉండటంతో వరి ఎక్కువగా వేస్తున్నాం.

సన్నాలకు డిమాండ్ ఉండటంతో సాగు పెంచాం..

: దిగంబర్, రైతు సిద్దాపూర్



కొన్నేళ్లుగా సన్నాలకు డిమాండ్ పెరిగింది. మద్దతు ధరకు మించి వ్యాపారులు నేరుగా పొలాల వద్దకు వచ్చి ధాన్యాన్ని కొంటున్నారు. దొడ్డు రకాలతో పోలిస్తే 15 రోజులు ఎక్కువ సమయం పట్టిన లాభం ఉండటంతో సన్నరకాల వరినే వేస్తున్నాం. మిల్లర్లతో పాటు వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంతో ఇబ్బందులు ఉండటం లేదు.

ప్రభుత్వం బోనస్ ఇస్తుండటంతో సన్నాల సాగు చేస్తున్నాం..

: గోక గంగారెడ్డి, రైతు డొంకేశ్వర్



సన్నాలు సాగు చేస్తే బోనస్ వస్తుండటంతో వేస్తున్నాం. దొడ్డు రకాలతో పోలిస్తే సన్నాలకు పెట్టుబడి ఎక్కువే. దిగుబడి కూడా తక్కువగా ఉంటుంది. డిమాండ్ ఉండటం, ప్రభుత్వమే కొనుగోలు చేస్తుండటంతో ఈ పంటను వేస్తున్నాం. క్వింటాలుకు 500 బోనస్ ఇస్తుండటం వల్ల ఈ యాసంగిలో దొడ్డు రకాలను తగ్గించి సన్నరకాలను వేస్తున్నాం.

ఇంటర్వ్యూ

యాసంగి రుణాలకు చర్యలు



- రూ.1762 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయం
- మార్చి చివరి వరకు రుణాలు పంపిణీ చేస్తాం
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహాన్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నిజామాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో రైతులకు యాసంగి పంట రుణాలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే గ్రామాల్లోని ఆయా బ్యాంకుల పరిధిలో రైతులకు రుణాలను పంపిణీ చేస్తున్నాం. రైతులు వేసే పంటల ఆధారంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఈ రుణాలను అందిస్తున్నామని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహాన్ 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: జిల్లాలో రైతులకు యాసంగి సాగుకు రుణాలు అందిస్తున్నారా?

లీడ్ బ్యాంక్ మేనేజర్: జిల్లా బ్యాంకర్ల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ఇప్పటికే యాసంగి సాగు కోసం ఆయా బ్యాంకుల నుంచి రుణాలను పంపిణీ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఈ యాసంగిలో ఎన్ని కోట్ల రుణాలు రైతులకు ఇవ్వాలని నిర్ణయించారు?

మేనేజర్: జిల్లా బ్యాంకర్ల కమిటీలో తీసుకున్న నిర్ణయం ప్రకారం యాసంగిలో రూ.1762 కోట్ల పంట రుణాలను ఇవ్వాలని నిర్ణయించాం. ఇప్పటికే నెల రోజుల నుంచి రుణ పంపిణీ మొదలు పెట్టాం. యాసంగి పంటల సాగును దృష్టిలో పెట్టుకొని మార్చి నెలాఖరు వరకు ఈ రుణపంపిణీ కొనసాగిస్తాం. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు కూడా లక్ష్యాలను నిర్ణయించాం. ఆయా గ్రామాలు, మండలాల పరిధిలోని బ్యాంకుల ద్వారా ఈ రుణాలను అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో వరి ఎక్కువగా సాగవుతోంది. ఈ పంటకు ఏ విధంగా రుణాలను ఇస్తున్నారు?

మేనేజర్: వరిసాగు చేసే రైతుకు ఎకరాకు 40వేల రూపాయలను అందిస్తున్నాం. మొక్కజొన్న సాగుచేసే రైతులకు 34వేల రూపాయలు అందిస్తున్నాం. జవార్‌కు 20వేలు, గోదుమకు 21వేలు, జొన్నకు 17వేల రూపాయలు చొప్పున ఎకరాకు ఈ రుణాలను అందిస్తున్నాం. రైతులు వేసే పంటల ప్రకారమే ఈ రుణ పంపిణీ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలోని రైతులు యంత్రాలను కొనుగోలు చేసేందుకు రుణాలను మంజూరు చేస్తున్నారా?

మేనేజర్: వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించేందుకు జిల్లాలోని బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నాం. ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, ఇతర యంత్రాలకు కావాల్సిన రుణాలను అందిస్తున్నాం. వ్యవసాయంతో పాటు డెయిరీ, పౌల్ట్రీ, చేపల పెంపకం వంటి రంగాలను ప్రోత్సహించేందుకు ఈ రుణాలను మంజూరు చేస్తున్నాం. వీటితో పాటు ఉద్యానవన పంటల సాగుకు కూడా రుణాలను అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో గత వానాకాలం సీజన్‌లో ఎంతవరకు రుణాలను మంజూరు చేశారు?

మేనేజర్: జిల్లాలో గత వానాకాలంలో మొత్తం 2640 కోట్ల రూపాయలను పంట రుణాలుగా ఇవ్వాలని నిర్ణయించాం. జిల్లాలో 2285 కోట్ల రుణాలను మంజూరు చేశాం. నిర్ణయించిన లక్ష్యంలో 86.56 శాతం రుణాలను వానాకాలంలో అందించాం. అదేరీతిలో ఈ యాసంగిలో కూడా పంట రుణాలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: కొన్ని బ్యాంకుల పరిధిలో రైతులకు సత్వరంగా రుణాలు అందించడం లేదు. వాటిపై దృష్టి పెడుతున్నారా?

మేనేజర్: జిల్లాలోని ప్రభుత్వరంగ, గ్రామీణ, ప్రైవేటు బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలు అందిస్తున్నాం. ప్రతినెలా కలెక్టర్ ఆధ్వర్యంలో బ్యాంకర్ల సమావేశం నిర్వహిస్తున్నాం. రైతుల పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలపై సమీక్షించి నిర్ణయం తీసుకుంటున్నాం. జిల్లాలోని ఏ బ్యాంకు శాఖ నుంచైనా రుణ పంపిణీ సక్రమంగా లేకుంటే వారికి ఆదేశాలు ఇచ్చి రుణాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ఎస్సీ వర్గీకరణ అంశంపై ఏకసభ్య కమిషన్ బహిరంగ విచారణ

- సమగ్ర నివేదిక సమర్పిస్తామని జస్టిస్ షమీమ్ అక్తర్ వెల్లడి
- ఏకసభ్య కమిషన్‌కు వెల్లువెత్తిన వినతులు

8

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- రైతుభరోసాకు నిబంధనలు విధిస్తూ రైతులకు సున్నం పెట్టే ప్రయత్నం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- కేసీఆర్ రైతాంగాన్ని కడుపులో పెట్టుకొని కాపాడుకున్నారు
- బోధన్ నియోజకవర్గ పార్టీ నేతల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

8

నగరాన్ని కమ్మేసిన పొగమంచు

- 11 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత
- జిల్లాలో పెరిగిన చలి తీవ్రత

7



అధికారులు, కాంట్రాక్టర్లు చిత్తశుద్ధితో పనిచేయాలి

సుభాష్‌నగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాలకు అనుగుణంగా చేపట్టే పనులు అధికారులు, కాంట్రాక్టర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమృత్-2 పథకం కింద నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అమ్మ వెంచర్‌లో బ్రిడ్జి నిర్మాణం అయినప్పటికీ చిన్న చిన్న పనులు కాకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. టియుఎఫ్ఐడిసి ఫండ్ ద్వారా వచ్చిన 60 కోట్లు డివిజన్‌కి కోటి రూపాయలు త్వరితగతిన టెండరింగ్ ప్రక్రియ పూర్తి చేసి నాణ్యతతో కూడిన సిసి డ్రైనేజీ, కల్వర్టుల నిర్మాణం పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ అండ్ హెల్త్ ఇంజనీరింగ్ ఈఈ తిరుపతిరెడ్డి, డీఈ నాగేష్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత చర్యలపై అవగాహన పెంపొందించాలి



రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలు, ఫ్లెక్సీలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు గురువారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. రోడ్డు ప్రమాదాలను నిలువరించేందుకు వీలుగా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత చర్యలు పాటించేలా ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కరపత్రాలు, ఫ్లెక్సీల ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర్, మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ కిరణ్ పాల్గొన్నారు.









ఫటా..ఫట్...

బీర్కూర్ మండలంలో 4,463 జాబ్ కార్డులు

●'ఆంధ్రజ్యోతి'తో అక్మల్, ఏపీవో, బీర్కూర్



ఆంధ్రజ్యోతి: బీర్కూర్ మండలంలో ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయి? ఎంత మంది ఉపాధి కూలీలు ఉన్నారు?

ఏపీవో: బీర్కూర్ మండలంలో 4,463 జాబ్ కార్డులు ఉన్నాయి. 7 వేల 84 మంది ఉపాధి కూలీలు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: 2024-25 ఆర్థిక సంవత్సరంలో కూలీలకు ఎన్ని పని దినాలు కల్పించారు?

ఏపీవో: ఈ ఆర్థిక సంవత్సరంలో లోఅ 15 వేల 627 పని దినాలు కల్పించాము. 3,064 జాబ్ కార్డులకు గాను 4,441 మంది కూలీలకు ఈ సంవత్సరం పునలు కల్పించాం.

ఆంధ్రజ్యోతి: ఉపాధి పనుల్లో భాగంగా ఎన్ని రకాల పనులు చేయించారు? ఎంత మాత్రం ఖర్చు చేశారు?

ఏపీవో: మొత్తం 510 రకాల పనులకు గాను 3 కోట్ల 27 లక్షల 80 వేలు ఖర్చు చేయడం జరిగింది. వేసవి కాలంలో కందకాలు, చెరువులలో, కుంటలలో, కాలువలలో పూడికతీత పనులు చేయించాము.

ఆంధ్రజ్యోతి: ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుతం ఏఏ పనులు కొనసాగుతున్నాయి?

ఏపీవో: ప్రస్తుతం వంద శాతం సబ్సిడీపై ఫారం పాండ్‌లు, పశువుల కొట్టాలు, కోళ్ల ఫారం, ఇంకుడు గుంతలు, బీడు భూముల అభివృద్ధి, కంపోస్టు పెడ్లు, అజోల్ల పెంపకం లాంటి పనులు చేపడుతున్నాం. వంద శాతం సబ్సిడీతో ఫారం పాండ్‌లు తవ్వించి రైతుల చేత చేపల పెంపకం చేపట్టేలా ప్రోత్సహిస్తున్నాం. ఇందు కోసం రైతులు, లబ్దిదారులు గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శిని, మండల స్థాయిలో ఉపాధిహామీ ఏపీవో ను సంప్రదించాలి.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఈ ఏడాది ఎన్ని మొక్కలు నాటారు?

ఏపీవో: మండల వ్యాప్తంగా 73 వేల మొక్కలు నాటి సంరక్షించాం.

ఆంధ్రజ్యోతి: బీర్కూర్ మండలంలో ఎన్ని నర్సరీలు ఉన్నాయి? ఎన్ని మొక్కలు పెంపకం చేస్తున్నారు?

ఏపీవో: మొత్తం 12 నర్సరీలు పెంపకం చేపడుతున్నాం. వచ్చే సంవత్సరం మండలంలో లక్ష మొక్కలు నాటుటకు మొక్కలను పెంచుతున్నాం. ● (ఆంధ్రజ్యోతి, బీర్కూర్)

నీటి కాలువలో మునిగి కూలీ మృతి

ఆర్మూర్ టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేగాం గ్రామ శివారులో గల నీటి కాలువలో మునిగి వలస కూలీ కేశవ్ గంగాధర్(29) మృతి చెందాడని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఆరు నెలల క్రితం దేగాం గ్రామానికి వలస వచ్చిన కేశవ్ గంగాధర్ కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం గ్రామ శివారులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందినట్టు తెలిసింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

ఆటో, కారు ఢీ.. పలువురికి గాయాలు

బోధన్‌రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం భవానీపేట్ గ్రామ సమీపంలో ఆటోను వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఆటో పల్టీ కొట్టడంతో ఆటోలో ఉన్న రాకాసిపేట్ ప్రాంతానికి చెందిన సవిత, జాడి గ్రామానికి చెందిన హృదయ రాజు, రాణిలకు తీవ్ర గాయాలు అయ్యాయని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి భవానీపేట్ గ్రామ శివారులో ఆటోను కారు ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుందన్నారు. ప్రమాద ఘటన తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రులను బోధన్ ఆసుపత్రికి తరలించామన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. ప్రమాద ఘటనపై పూర్తి విచారణ చేపట్టి కేసు నమోదు చేశామన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల అప్పగింత

సాలూర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న పలువురు బాధితులకు గురువారం తిరిగి వారి ఫోన్‌లను అప్పగించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. సుమారు 15మంది తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నట్లుగా ఫిర్యాదు చేశారన్నారు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌లను గుర్తించి బాధితులకు అప్పగించామన్నారు.

విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

బోధన్‌రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రమాదాల బారిన పడకుండా ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని పట్టణ సీఐ వెంకటనారాయణ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని లయోల పాఠశాలలో జాతీయ రహదారి మహోత్సవాలలో భాగంగా విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలను ఇవ్వవద్దన్నారు. విద్యార్థులు ప్రతీఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఏడాదికి 6లక్షల మందికి పైనే ప్రజలు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్, ఉపాధ్యాయులు శంకర్, దేవిదాస్ ఉన్నారు.

ముదిరాజ్ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా బాపురావు

భీమ్‌గల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రానికి చెందిన పిట్ల బాపురావును ముదిరాజ్ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో భీమ్‌గల్‌కు చెందిన పిట్ల రామారావు ముదిరాజ్‌ను జిల్లా జాయింట్ సెక్రెటరీ ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొహిబిషన్‌ల్స్ అసోసియేషన్ తెలంగాణ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, రాష్ట్ర కార్యవర్గం చేతుల మీదుగా నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్ల సాయి, బాలు, ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి సభ్యులు దండు చిరంజీవి, సింగారపు రామకృష్ణ, సిద్ద మధు, విజయ్, దాసరి వీరన్న, చిరుత, వెంకటేశ్వర్లు, పొన్నం రాజు, శీలం జ్యోతితో పాటు జిల్లా నాయకులు, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

లెప్రసీ, టీబీ రోగులకు మెరుగైన వైద్యం

రెంజల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో లెప్రసీ, టీబీ రోగులకు ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా లెప్రసీ నియంత్రణ అధికారి భార్గవి అన్నారు. గురువారం రెంజల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం వీరన్నగుట్టలో లెప్రసీ కేసులు నమోదు కావడంతో బాధితుల ఇంటి వద్దకు వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవి గౌడ్, వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ షహిస్తా ఫిర్దోస్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి కరిపె రవీందర్, ఏఎన్ఎం విజయ్, ఆశ కార్యకర్తలు తదితరులున్నారు.

మోకన్‌పల్లి సొసైటీ ఏర్పాటుకు ప్రభుత్వం సుముఖం



నివేదికను జిల్లా అధికారికి అందజేస్తున్న దృశ్యం

● జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ వెల్లడి

నవీపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మోకన్‌పల్లి సొసైటీ ఏర్పాటుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నందున గురువారం జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ బినోల సొసైటీ పాలకవర్గం సభ్యుల అభిప్రాయాలను కోరుతూ గురువారం నవీపేట మండలం మోకన్‌పల్లి సొసైటీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బినోల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గతంలో విలీనం అయినటువంటి మోకన్‌పల్లి సహకార సంఘాన్ని యథావిధిగా వేరు చేయాలని గత ప్రభుత్వ హయంలో పాలకవర్గం సభ్యులు, రైతులు తీర్మానం చేస్తూ ఇచ్చిన ప్రతిపాదనలను ఆమోదిస్తూ యథావిధిగా వేరే చేయడానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన మేరకు గురువారం జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు నేతృత్వంలో పాలకవర్గ సభ్యుల బృందం, గతంలో విలీనమైన మోకన్‌పల్లి సొసైటీ పరిధిలోని గ్రామాలను వేరే చేసి యథావిధిగా సంఘం ఏర్పాటు చేసుకొనుటకు ఏకాభిప్రాయం తెలియజేయడం జరిగిందన్నారు. జిల్లా అధికారి కోరిన సంఘ ఆర్థిక వివరాలు, సంఘ సభ్యుల వివరాలు, ఆర్థిక పరిపుష్టి, తదితర స్థితిగతుల నివేదికలను జిల్లా సహకార అధికారికి అందజేయడం జరిగిందన్నారు. ఈ ప్రతిపాదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపి తొందరలోనే ఏర్పాటు చేయడానికి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు, ఉపాధ్యక్షులు ఖాజా, పాలకవర్గ సభ్యులు విజయ్, అంజాగౌడ్, గంగాధర్, బాలు, చందర్, రమణ రావు, నవీన్‌రావు, బేగరి గంగాధర్, సంపూర్ణ, సీఈవో రమేష్, జిల్లా సహకార బ్యాంకు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన అర్వింద్‌గౌడ్‌కు సన్మానం

వేల్పూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ పట్టా పొందిన అర్వింద్‌గౌడ్‌ను గురువారం వేల్పూర్ హెల్పింగ్ అండ్స్ సేవ సంస్థ, వేల్పూర్ వివిధ సంఘాల యువకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అర్వింద్ మాట్లాడుతూ 2003లో ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన బాల్యమిత్రులు తనను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ స్థాయికి రావడానికి ప్రోత్సహించిన అన్నయ్య రవీందర్‌గౌడ్, నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

టీఎన్‌జీవోస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులకు..

భీమ్‌గల్‌రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా టీఎన్‌జీవోస్ కార్యాలయంలో జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు సుమన్ ఆధ్వర్యంలో గురువారం టీఎన్‌జీవోస్ భీమ్‌గల్ మండల అధ్యక్షుడిగా కుంట శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పురస్తు నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కుంట శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పురస్తు నరేష్‌లను భీమ్‌గల్ ఐకేపీ కార్యాలయం ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్, ఎంపీవో జావీద్, ఐకేపీ ఏపీఎం రవీందర్, ఐకేపీ సిబ్బంది, మండల సమాఖ్య వీవోలు, సీసీలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీనియర్ సీసీలు గంగసాయిలు, గడాల రఘుపతి, బాస్కర్, గంగాధర్, సుమలత, లలిత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడికి..

వేల్పూర్, జనవరి2 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో ఇటీవల ఆర్యవైశ్య మహాజన సభ నూతన జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన పోల విఠల్‌గుప్తాను మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందు ఉండేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పోల సుధాకర్, వేల్పూర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లగిశెట్టి భానుచందర్, ప్రధాన కార్యదర్శి చిటిమల రాజ్‌కుమార్, క్యాషియర్ ఉత్తురుదారి, సతీష్, రాజు, శ్రీనివాస్, బోంపల్లి గంగాధర్, ప్రతాప్, రాజయ్య, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

కోటగిరి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను తప్పనిసరి అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పోచీరాం డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకై నియమించిన ఏకసభ్య కమిషన్ సభ్యుడు షమీమ్ అక్తర్ జిల్లా కేంద్రానికి గురువారం విచ్చేశారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ నాయకులు ఏకసభ్య కమీషన్ అక్తర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు కోటగిరి నుండి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ కులాల్లో వర్గీకరణ లేకపోవడంతో మాదిగ, మాదిగ ఉపకులాలు ఆర్థికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగపరంగా నష్టపోతున్నాయన్నారు. రాష్ట్రంలో షెడ్యూల్ కులాల్లో మాదిగల జనాభా ఎక్కువగా ఉందని, ఈ మేరకు ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, మాజీ సర్పంచ్‌లు ఆనంద్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని మాదిగ, మాదిగ ఉప కులాలకు న్యాయం చేయాలని కోరుతూ కమలాపూర్ గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పెరిక రాములు, మహేష్ మాదిగ, సుధాకర్ బాబు ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందించారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ డాక్టర్ షమీమ్ అక్తర్ గారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆకారం మహేష్ మాదిగ పాల్గొన్నారు.

వర్గీకరణ చేయొద్దని మాల సంఘాల వినతి

ఆర్మూర్‌రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీలకు రిజర్వు చేసిన కేటగిరిలో వర్గీకరణ చేపట్టవద్దని కోరుతూ గురువారం మాల సంఘం నాయకులు జస్టిస్ షమీమ్‌అక్తర్‌కు వినతిపత్రం అందజేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341, 342 ఎస్సీ, ఎస్టీలకు రిజర్వుడ్ కేటగిరిలో ఉపవర్గీకరణ చేయడం రాజ్యాంగానికి, రిజర్వేషన్‌ల స్ఫూర్తికి, బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానానికి వ్యతిరేకమని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. అంటరానితనం ప్రతిపాదికన వచ్చిన రిజర్వేషన్‌లను ఆర్థిక ప్రతిపాదికను ముడిపెట్టడం సరికాదని మాల సంఘం నాయకులు ఆవుల అశోక్, పింజ భూమేశ్వర్, పత్తేపూర్ సాయన్న కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● ఎస్ఈ రవీందర్

బోధన్‌రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందని విద్యుత్ ఉద్యోగుల ఎస్ఈ ఆపరేషన్ ఆర్.రవీందర్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయంలో డివిజన్ స్థాయి విద్యుత్ ఉద్యోగులు నూతన సంవత్సరం సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు మహోన్నతరమైన రక్తదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తలసేమియా బాధితుల కోసం రక్తదానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 65మంది ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ బోధన్ డీఈ ఎండీ ముక్క్యార్, ఏఈ నాయిని కృష్ణ, శివాజీ గణేష్, రెడ్‌క్రాస్ చైర్మన్ బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, బసవేశ్వర్ రావు, బోధన్ డివిజన్ చైర్మన్, ఏడీఈలు నగేష్ కుమార్, ప్రభాకర్, విద్యుత్ ఉద్యోగులు హైమద్, పాషా, పెంటయ్య, కళ్యాణ్, సాయిబాబా, రమాదేవి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కరిపె రవీందర్, వై.శ్రీనివాస్‌రావు, నరేందర్, సూర్యనారాయణ, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ మంత్రిని కలిసిన వేల్పూర్ మండల నాయకులు

వేల్పూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆర్అండ్‌బీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని శాలువతో సన్మానించిన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై అర్ధంతరంగా నిలిచిపోయిన రోడ్లను పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి పనులు తప్పకుండా పూర్తి చేస్తామని వేల్పూర్ మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి రవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

నవీపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని నవీపేట తహసీల్దార్ వెంకట రమణ అన్నారు. గురువారం నవీపేట మండలంలోని కమలాపూర్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ పరిసరా ప్రాంతాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రోడ్డు వెడల్పు మరింత పెంచాలి

భీమ్‌గల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైన 12 ఫీట్ల రోడ్డును 30 ఫీట్లకు పెంచాలని కోరుతూ ఎన్ ఎస్‌యూఐ రహమాన్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కళాశాల వెనుక ఐఐటీ, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, అయ్యప్పస్వామి, వెంకటేశ్వరస్వామి మందిరాలు ఉండడంతో రవాణాకు 12ఫీట్ల రోడ్డు సరిపోలేక ఉత్సవ సమయంలో ప్రజలకు ఇబ్బందికి గురవుతారన్నారు. ప్రజలు, విద్యార్థుల ఇబ్బందులు తొలగించడానికి మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలను ప్రకారం రోడ్డును 30ఫీట్ల వెడల్పు చేయాలని ఎన్ఎస్‌యూఐ విద్యార్థి నాయకులు అధికారులను కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఎన్ఎస్‌యూఐ విద్యార్థి నాయకులు ఈశ్వర్, రిశ్వంత్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్‌ల ఆవిష్కరణ



కోటగిరిలో పీఆర్‌టీయూ క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న దృశ్యం



హసాకొత్తూర్ లో ఎస్‌టీయూ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న ఎంఈవో

కోటగిరి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం పీఆర్‌టీయూ కోటగిరి మండల శాఖ ఆధ్వర్యంలో 2025క్యాలెండర్‌లను తహసీల్దార్ గంగాధర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్ రావు, పీఆర్‌టీయూ అధ్యక్షుడు బర్ల సాయిలు, ప్రధాన కార్యదర్శి ఉదయ్ చందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంగారాజు, శానం సాయిలు, సుధీర్, అర్షద్ హుస్సేన్, రవీందర్, రాజు, కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

● పొతంగల్‌లో..

పొతంగల్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం పీఆర్‌టీయూ పొతంగల్ మండల శాఖ ఆధ్వర్యంలో 2025 క్యాలెండర్‌లను తహసీల్దార్ మల్లయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శంకర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సాయిలు, పీఆర్‌టీయూ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాగనాథ్, ప్రశాంత్ కిరణ్, శ్రీరాం, హన్మాండ్లు, అబ్దుల్ ఖాదర్, రామారావు, అమ్జద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో ..

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ పాలెపు నర్సయ్య, మండల విద్యాధికారి ఎన్.ఆంధ్రయ్య, టేబుల్ క్యాలండర్‌ను మండల నోడల్ అధికారి కనక గంగాధర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పి సాయన్న గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పి.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అంజద్ సుల్తాన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్, వేముల నాగభూషణం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, రాధాకిషన్, కార్యదర్శి బంతిలాల్, బి.జ్ఞానేశ్వర్, రోహిత్ ప్రధానోపాధ్యాయులు రాజన్న, రాంప్రసాద్, మధుపాల్, కృష్ణకుమార్, బాలయ్య, గిరిధర్ కోల రాజేశ్వర్, సున్నం శ్రీనివాస్, రంజీత్, మధుశేఖర్, షేక్‌జాన్, లక్ష్మీనర్సయ్య, రాజేశ్వర్ సభ్యులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని హసాకొత్తూర్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్‌టీయూ) నూతన సంవత్సర క్యాలండర్ డైరీలను మండల విద్యాధికారి ఎన్.ఆంధ్రయ్య, మండల నోడల్ అధికారి కనక గంగాధర్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు బుస్స కృష్ణకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముప్కాల్: మండల పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఎంఈవో జక్కుల రవి కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం మొగిలి గంగారాం, ఎంపీవో గౌస్‌మోహీనోద్దిన్ పీఆర్‌టీయు మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి కొండ్రు నవీన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గుండోజి నరేందర్, సామ ప్రసాద్, తాడూరి లక్ష్మణ్, శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాపు రావు, ముప్కాల్ మండల అసోసియేట్ అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి రాజేష్, ఉపాధ్యాయులు నవీన్, సునీత, నరేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో గురు వారం పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను మండల విద్యాధికారి సమ్మిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించ డంలో పీఆర్‌టీయూ సంస్థ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు మగ్గిడి ప్రవీణ్, ప్రధానకార్యదర్శి ప్రగతి కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సాయిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్, శ్రీనివాసబాలు, జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, రవి, రాములు, పాల్గొన్నారు.

వర్ని: మండల కేంద్రంలో గురువారం పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఉపాధ్యాయ సంఘాలు ఆవిష్కరించారు. 2025 ఏడాదికి స్వాగతం పలుకుతూ ఉపాధ్యాయులు సంబరాలు నిర్వహించి స్వీట్లు పంచారు. ఈ విద్యా సంవత్సరం విద్య బోధనలో ఉత్తమ ఫలితాలు సాధిస్తామని సంఘ నాయకులు శేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు కృష్ణ వర్మ ప్రసాద్, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లా జడ్జికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

జిల్లా న్యాయాధికారికి శుభాకాంక్షలు తెలిపిన బార్ అసోసియేషన్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీతకు బార్ అసోసియేషన్ సభ్యులు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో ప్రధాన న్యాయాధికారి కుంచాల సునీతను మర్యాద పూర్వకంగా కలిసి బార్ అసోసియేషన్ సభ్యులు పూలబోకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, సభ్యులు శంకర్, అరుణ్‌కుమార్, సుకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ కేంద్రాన్ని సందర్శించిన నర్సింహ మహరాజ్

ఆర్మూర్‌టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇస్కాన్ కేంద్రాన్ని సందర్శించడానికి వచ్చిన భక్తి విఘ్నవినాశ నర్సింహ మహరాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు భక్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం శ్రీకృష్ణభగవునికి ప్రత్యేక పూజలు నిర్వహించి కీర్తనలు, మహా హారతి కార్యక్రమం నిర్వహించారు.

శబరిమలకు తరలివెళ్లిన అయ్యప్ప స్వాములు

కోటగిరి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కోటగిరి, పొతంగల్ మండలాల నుంచి గురువారం అయ్యప్ప స్వాములు శబరిమలకు తరలివెళ్లారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లో సుమారు 60 మంది అయ్యప్ప స్వాములు 41రోజుల పాటు కఠిన దీక్షను ఆచరించారు. శబరిమలకు తరలివెళ్లే అయ్యప్ప స్వాములకు గురుస్వాములు ఇరుముడులను కట్టారు. స్థానిక ఆలయాల్లో స్వాములు పూజలు నిర్వహించి శబరిమలకు తరలివెళ్లారు.

రుద్రూరులో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

రుద్రూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ వీరభద్ర స్వామి ఆలయం వద్ద గురువారం అమ్మానాన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 20మంది వృద్దులకు, యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ ట్రస్టు వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుని దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్టు సభ్యులు రత్నావేణి, శ్యామల, ప్రతిమ, విష్ణు, ఆలయ చైర్మన్ వెంకన్న, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్లాసులు, మ్యాట్లు..

వర్ని, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వర్ని మండల కేంద్రంలో గురువారం విద్యార్థులకు గ్లాసులు, మ్యాట్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షులు ఠాగూర్, సెక్రటరీ శ్రీనివాస్, ట్రెజరర్ శివరాజ్ పాల్గొన్నారు.

టై, బెల్ట్‌ల వితరణ

మోర్తాడ్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు స్వరూపరాణి గురువారం పాఠశాల విద్యార్థులకు టైలు, బెల్ట్‌లను పంపిణీ చేశారు. స్వరూపరాణి తండ్రి స్మారకార్థం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సమ్మిరెడ్డి, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీల సమ్మె

ఆర్మూర్‌టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌యార్డులో సివిల్ సప్లయ్ హమాలీల సమ్మె గురువారం రెండో రోజుకు చేరుకుంది. పెంచిన హమాలీల రేట్లు అమలు చేయాలని, కుటుంబ జీవనో పాధి నడవడం కష్టంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం హమాలీలపై మొసలి కన్నీరు కరుస్తుందని, పెంచిన రేట్లను వెంటనే అమలు చేసి మమ్మల్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి సభ్యులు హమాలీలకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఆరేపల్లి సాయిలు, మౌలాన, శీను, ఫిరోజ్, పరుశురాం, నవీన్, దళిత పోరాట హక్కుల సమితి డివిజన్ కార్యదర్శి నరేష్, దుర్గం రాజేందర్, రవి, శీను, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థికసాయం

మెండోర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తమ స్నేహితుడు తనతో చదువుకొని అంద రితో కలిసిమెలిసి ఉండే మిత్రుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలుసుకొని మిత్రులు ఆసుపత్రిలో చికిత్స కోసం రూ.లక్ష 10వేల ఆర్థికసాయం చేసి స్నేహితుడి కుటుంబాన్ని అండగా మేమున్నామని వారి కుటుంబ సభ్యులకు 2003-04 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వివరాల్లోకి వెళితే ఇటీవల కోడిచర్ల గ్రామానికి చెందిన శ్రీకాంత్ కోడిచర్ల, చాకిర్యాల్ గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో నిర్మల్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి చికిత్స పొందుతున్న సమయంలో ఆసుపత్రికి వెళ్లి రూ.70వేల ఆర్థికసాయం చేశారు. బుధవారం ఇంటికి వచ్చిన స్నేహితుడిని పలకరించి రూ.40వేలు అందజేశారు. తోటి స్నేహితుడు అండగా ఉంటామని ఎలాంటి అధైర్యపడవద్దని శ్రీకాంత్ కుటుంబానికి ధైర్యం కల్పించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మిత్రుడికి అండగా నిలబడ్డ తోటి స్నేహితులకు పలువురు ప్రశంసించారు.

రేపు ఎమ్మెల్యే, శాస్త్రవేత్తల సమక్షంలో చెరకు రైతుల సమావేశం

బోధన్‌రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): శనివారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, శాస్త్రవేత్తలతో బోధన్ చక్కెర కర్మాగారంపై రైతులతో ఎడపల్లి మండలం సరయు ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఉంటుందని టీపీసీసీ అధ్యక్షులు గంగాశంకర్ తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఇటీవల రైతులతో బోధన్ చక్కెర కర్మాగారం పునర్ స్థాపనలో భాగంగా వాయిదా పడిన సమావేశం శనివారం కొనసాగుతుందన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో పాటు శాస్త్రవేత్తలు రానున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి చెరకు పంట సాగు చేస్తున్న రైతులు, చెరకు సాగుకు ఆసక్తి ఉన్న రైతులతో చర్చ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

బ్రాహ్మణ సేవా సమాజ్ క్యాలెండర్ ఆవిష్కరణ

బోధన్‌రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో బోధన్ బ్రాహ్మణ సేవా సమాజ్ ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్‌లను బోధన్ ఏసీపీ శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సమాజ్ అధ్యక్షుడు ప్రవీణ్ మహరాజ్ మాట్లాడుతూ నూతన ఆంగ్ల సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకట నారాయణ, బ్రాహ్మణ సేవా సమాజ్ ప్రధాన కార్యదర్శి వైద్య ఉమానంద్, కోశాధికారి ఐనంపూడి చక్రవర్తి, విజయసాయి ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, ఆంటోని చైర్‌పర్సన్, వైద్య మనోజ్ కుమార్, రామారావు, మదన్‌రావు, అశోక్ రావు కులకర్ణి, యోగిరాజు, వినోద్ పట్వారీ తదితరులు పాల్గొన్నారు.

చలో నిజామాబాద్ పోస్టర్ల అవిష్కరణ

కమ్మర్‌పల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు పర్చాలని, స్వామినాథన్ సిఫారసులను అమలు పరుస్తూ కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు పర్చాలని తదితర సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 6న చలో నిజామాబాద్ కలెక్టరెట్ విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా పిలుపునిచ్చింది. ఈ మేరకు కమ్మర్‌పల్లి పార్టీ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌లను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సారా సురేష్, మండల అధ్యక్షుడు వి.బాలయ్య, కార్యదర్శి బి.అశోక్ పాల్గొన్నారు.



బెటాలియన్ పోలీసుల రిహార్సల్స్

సర్వాంగ సుందరంగా
బెటాలియన్ గ్రౌండ్ ముస్తాబు

● నేడు శిక్షణ పోలీసుల పాసింగ్ ఔట్ పరేడ్
● హాజరుకానున్న ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ

డిచ్‌పల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది మార్చి నెలలో 7వ పోలీస్ బెటాలియన్‌లో ప్రారంభమైన పోలీసుల శిక్షణ 9 నెలల పాటు జరిగి నేడు ముగియనుంది. ఈ పాసింగ్ ఔట్ కార్యక్రమానికి నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఇందుకు తగిన విధంగా కమాండెంట్ సత్యనారాయణ పోలీస్ అధికారులతో కలిసి శిక్షణ పోలీసుల రీహార్సల్ సర్దార్ వల్లబాయి పటేల్ స్టేడియంలో పరిశీలించారు. పోలీసుల శిక్షణ సమయంలో నేర్చుకున్న అత్యంత కఠోర విన్యాసాలు పోలీసులు నేడు ప్రదర్శించనున్నారు. 7వ పోలీస్ బెటాలియన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 463 మంది సిబ్బందిలో డిగ్రీ విద్యాభ్యాసం చేసినవ వారు 279, పీజీ 34, బీటెక్ 32, ఇంటర్ 111, బీ ఫార్మసీ 2 ఉన్నారు. వీరందరికి నేడు బెటాలియన్‌లో సర్టిఫికేట్‌లను అందజేయడంతో పాటు బాధ్యతలు చేపట్టే విధులను వారికి అప్పగించనున్నారు. ఇప్పటికే బెటాలియన్‌ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఇదివరకే 27న జరగాల్సి ఉండగా ఈ కార్యక్రమం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో వాయిదా వేసి తిరిగి నేడు నిర్వహిస్తున్నారు.

టూటా ఆధ్వర్యంలో వీసీకి ఘన సన్మానం



క్యాంపస్ కబుర్లు

టీయూలో వీసీని సన్మానిస్తున్న టూటా ప్రతినిధులు

డిచ్‌పల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం 2025ను పురస్కరించుకొని తెలంగాణ వర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) ప్రతినిధులు వీసీ ప్రొ.యాదగిరి రావుకు శాలువా కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టూటా ప్రతినిధులు మాట్లాడుతూ. నూతన, వినూతన ఆలోచనలు అనుసరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మద్దతు వర్సిటీని అభివృద్ధిలోకి తీసుకుపోవాలని వీసీని కోరారు. ప్రభుత్వం నుంచి అధ్యాపకులకు, ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టూటా అధ్యక్షుడు పున్నయ్య, సత్యనారాయణరెడ్డి, రాజేశ్వరీ, బాలకిషన్, నాగ రాజు, జమీల్ షైమద్, శిరీష, వాసం చంద్రశేఖర్, అబ్దుల్ ఖవి, వీరభద్రం, అంజయ్య పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించిన వీసీ



టీయూలో జాతీయ సదస్సు బ్రోచర్‌లు ఆవిష్కరిస్తున్న వీసీ

డిచ్‌పల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ తెలంగాణ యూనివర్సిటీ ఫిబ్రవరిలో జరిగే రెండు రోజుల జాతీయ సెమినార్ బ్రోచర్‌ను వీసీ యాదగిరి రావు గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. జాతీయ సదస్సు అంశం యూత్ అండ్ సోషల్ ఇంటర్న్‌షిప్ ఫోస్టరింగ్ ది నెక్స్ట్ జనరేషన్ ఆఫ్ చేంజ్ మేకర్ ఇన్ ఇండియా అనే అంశం జాతీయ సదస్సు జరగనుందని సామాజిక సమస్యలపై సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లు యువత నూతన ఆవిష్కరణలు స్థిరమైన పరిష్కారాలను అభివృద్ధి చేస్తుందని వీసీ పేర్కొన్నారు. పలు రంగాల్లో నిపుణులు, పరిశోధకులు, విద్యార్థులు పరిశోధన పత్రాలు సమర్పిస్తారని జాతీయ సదస్సు కన్వీనర్ వీరభద్రం కో కన్వీనర్ రాజేశ్వరి, అంజయ్యలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యా మండలి, ఐసీఎస్ఎస్ఆర్, సౌత్ సెంట్రల్ రిజియన్ హైదరాబాద్ వారి సహకారంతో ఈ సదస్సు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ యాదగిరి, అధ్యాపకులు చంద్రశేఖర్, అరుణ, హారతి, వీరభద్రం, రాజేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద రహిత జిల్లా ఏర్పాటే లక్ష్యం

● కొనసాగుతున్న రోడ్డుభద్రత మాసోత్సవాలు
● జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు

భిక్కనూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి హైదరాబాద్ మహా నగరానికి దగ్గరగా ఉండటంతో పాటుగా ఐదు జిల్లాల కూడలిగా ఉంది. కామారెడ్డి నుంచి హైదరాబాద్‌తో పాటుగా కామారెడ్డి నుంచి మెదక్, సంగారెడ్డి, సిరిసిల్లా, సిద్దిపేట, నిజామాబాద్‌కు వెళ్లే రహదారులు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటాయి. దీంతో నిత్యం జిల్లా రోడ్లపై ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణ శాఖ అధికారులు, పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపట్టిన, ఎన్నిరకాల చర్యలు తీసుకున్న వాహనదారుల్లో మాత్రం ఎలాంటి మార్పు కన్పించడం లేదు. ఈ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రతీ సంవత్సరం రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తుంది. ఈ మాసోత్సవాల్లో భాగంగా ప్రతీరోజు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను జిల్లా రవాణశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తూ కామారెడ్డి జిల్లాను రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా చేయడానికి ప్రత్యేక కృషి చేస్తున్నారు.



భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదాల్లో యువతే ఎక్కువ

ఎంతో మంచి భవిషత్తు ఉన్న యువత ఎక్కువగా ఈ రోడ్డు ప్రమాదాల్లో మరణించడం, తీవ్ర గాయాల పాలవడం ఆందోళన కల్గిస్తుంది. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండితే వాహనాలు నడిపేందుకు అనుమతి(లైసెన్స్) లభిస్తుంది. కానీ 18సంవత్సరాలు నిండ కున్నా వాహనాలను నడుపుతూ మితిమీరిన వేగంతో వెళ్తు ఎక్కువగా ప్రమాదాలకు కారణమవుతున్నారు. చాలా మంది తల్లిదండ్రులు వారి పిల్లలకు ఏదో గొప్పలకు పోయి చిన్నప్పటి నుంచే వాహనాలను వారి చేతికివ్వడంతో ఇదే అదునుగా వారు వాహనాలను ఇష్టం వచ్చినట్లు, అతివేగంతో వాహనాలు నడుపుతున్నారు. స్నేహితులు రీల్స్ పేరుతో, ఇతరాత్ర కార్యక్రమాల పేరుతో వాహనాలతో ప్రమాదకర స్టంట్లు వేయడం, హెల్మెట్ పెట్టుకోకపోవడం వెకిలి చెష్టలు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. యువకులను కట్టడి చేయడం అధికారులకు పెద్ద టాస్కే. కాగా ప్రతీ సంవత్సరం రవాణ శాఖ, పోలీసు అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న వాహనదారుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. ఎంవీఐ యాక్ట్ ప్రకారం పోలీసులు విధిస్తున్న జరిమానాలే ఇందుకు నిదర్శనం.

జిల్లాలో 54 కిలో మీటర్ల జాతీయ రహదారి..

కామారెడ్డి జిల్లాలో భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ నుంచి సదాశివనగర్ గిద్ద గ్రామం వరకు 54కిలోమీటర్ల 44వ జాతీయ రహదారి ఉంది. ఈ రోడ్డుకు ఆనుకుని చాలా గ్రామాలు ఉన్నాయి. చాలా గ్రామాల వద్ద 44వ జాతీయ రహదారిపై సరైన వసతులు, బ్రిడ్జిలు లేకపోవడంతో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటు న్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్‌హెచ్ఏఐ, రవాణశాఖ అధికారులు ఎప్పటికప్పుడు ఎక్కువగా ఎక్కడ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయో ఆ స్పాట్‌లను గుర్తించి అక్కడ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని వాహనదారులు కోరుతున్నారు. జాతీయ రహదారితో పాటుగా అంతర్ జిల్లా రోడ్లపైనా ఇటీవల ప్రమాదాలు ఎక్కువగానే జరుగుతున్నాయి.

ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులపై ఫోకస్..

రోడ్డుభద్రత మాసోత్సవాల్లో బాగంగా ఈ సంవత్సరం ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలపై రవాణాశాఖ అధికారులు ఫోకస్ చేయనున్నారు. విద్యార్థులు లైసెన్స్ పొందెవరకు వాహనాల జోలికి వెళ్లకుండా ఉండటంతో పాటుగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు తప్పకుండా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించేలా ప్రోత్సహించే విధంగా చూడటం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరిస్తే ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి, ఒకవేళ ధరించకపోతే ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయన్న విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించేలా వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించనున్నారు.

రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమాలు ఇలా..

రోడ్డు భద్రత మాసోత్సవాల్లో బాగంగా రవాణశాఖ, పోలీసు శాఖ అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రతీరోజు జిల్లావ్యాప్తంగా మార్కెట్ స్థలాలు, పాఠశాలలు, కళాశాలల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, రోడ్డు భద్రత ప్రతిజ్ఞ, వర్క్‌షాప్, నాటకాలు వంటి కార్యక్రమాలు చేపట్టడం, ట్రాఫిక్ నియమాలు, నిబంధనలు, ఎంవీఐ చట్టం, హెల్మెట్, సీట్‌బెల్టు ఉపయోగం, తదితర అంశాలపై వాహనదారులకు అవగాహన కల్పించడం, సెమినార్‌లు నిర్వహించడం, డ్రైవర్లకు కంటిపరిక్ష శిబిరాల ఏర్పాటుతో పాటుగా ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నారు.

వరిలో తడి..పొడి సాగుపై రైతులకు అవగాహన

కమ్మర్‌పల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వరిపంట సాగులో తడి- పొడి సాగు పద్దతులను రైతులు అలవర్చుకోవాలని కమ్మర్‌పల్లి మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ అన్నారు. గురువారం మండలంలోని నర్సాపూర్ గ్రామ రైతులకు తడి-పొడి సాగువిదానంపై డాక్టర్ రెడ్డీస్ ఫౌడేషన్ అధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు వరిలో నీటిని ఆదా చేసుకునే పద్దతులను రైతులు అమలు చేసుకోవాలని వరిలో కలుపు తొలగించుకున్న తరువాత పొట్ట దశ వరకు వచ్చే సమయం వరకు ఎక్కువ నీటి అవసరం ఉడదని కనుక తడి-పొడి విదానం పాటించాలని సూచించారు. ఈ కారణంగా నీరు వృధా కాకుండా యాసంగిలో పంట చివరి దశ వరకు పొలాలకు సాగు నీరందించ వచ్చన్నారు. ఈ విధానంలో 30 సెంటీమీటర్ల పీవీసీ పైపును 15 సెంటీమీటర్ల మేర రెండు సెంటీమీటర్ల ఎడంలో రంధ్రాలు చేసుకుని జల్లెడ మాదిరి తయారు చేసుకుని దీన్ని పొలం గట్టు నుంచి మీటర్ దూరంలో అమర్చుకోవాలన్నారు. పీవీసీ పైపులో నీరు 15 సెంటీమీటర్ల కిందకు పడిపోయినప్పుడు మాత్రమే నీటిని అందించాలని రైతులకు సూచించారు. ఈ పద్దతి పాటిస్తే నీటి వృథాను అరికట్టడంతో పాటు వరి పంటపై దోమ పోటును సైతం నివారిస్తూ అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. క్షేత్రస్థాయిలో అవగాహనతో పాటు రైతులకు పీవీసీ పైపులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫైడేషన్ ప్రతినిధులు చింత శ్రీనివాస్, మహేందర్, రైతులు లింబన్న, సంజీవ్ రమేష్ ఎర్రన్న, ప్రవీణ్, బుచ్చన్న,సాయన్న తదితర రైతులు పాల్గొన్నారు.



నర్సాపూర్ గ్రామ రైతులతో మాట్లాడుతున్న ఏవో రమ్యశ్రీ

హనుమాన్ టేకిడి రైల్వేగేట్ మూడు రోజుల పాటు మూసివేత

బోధన్‌రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణం నుంచి బెల్లాల్ వైపు వెళ్లేటప్పుడు మార్గమధ్యలో హనుమాన్ టేకిడి వద్ద రైల్వేగేట్ మూడు రోజుల పాటు మూసి ఉంచడం జరుగుతుందని, రైల్వే పట్టాల మరమ్మత్తు పనులు చేపడుతున్నట్లు బోధన్ రైల్వేస్టేషన్ మేనేజర్, రైల్వేశాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి ఆదివారం సాయంత్రం వరకు రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు కొనసాగుతాయన్నారు. ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా బెల్లాల్ వైపు వెళ్లే ప్రజలు రాకాసిపేట ఎమ్మార్వో కార్యాలయం పక్క నుంచి బెల్లాల్ రోడ్డు మీదుగా వెళ్లాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు చేడపడుతున్నామన్నారు. రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే పట్టాల మరమ్మతులు చేపడుతున్నామని రైల్వే అధికారులు తెలిపారు.



బెల్లాల్ రైల్వే గేటు దృశ్యం

టీయూ - 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన వీసీ



డైరీని ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

డిచ్‌పల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ 2025 నూతన సంవత్సర క్యాలండర్‌ను గురువారం సాయంత్రం వీసీ ప్రొ.యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ సహకారంతో వర్సిటీని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం, వసతి కల్పించాల్సిన బాధ్యత వర్సిటీ అధికారులపై ఉందన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ ఆవిష్కరణలో పబ్లికేషన్ సెల్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొ.ఆరతి, ఆడిట్ సేల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, కంట్రోలర్ ప్రొ.అరుణ, యూజీసీ కో ఆర్డినేటర్ ప్రొ.ఆంజనేయులు, డీన్ ప్రొ.లావణ్య, ప్రొ.అపర్ణ, ప్రొ.రాంబాబు, చీఫ్ వార్డెన్ మహేందర్, రిజిస్ట్రార్ సాయాగౌడ్, సూపరింటెండెంట్ భాస్కర్, ఇంజనీర్ వినోద్ కుమార్, వార్డెన్ గంగాకిషన్ పాల్గొన్నారు.

కందకుర్తి త్రివేణి సంగమం సందర్శన

రెంజల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రాన్ని అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి గురువారం సందర్శించారు. కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రంతో పాటు పుష్కర ఘాట్‌లను సందర్శించి కందకుర్తి విశిష్టతను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటిసారిగా త్రివేణి సంగమ క్షేత్రానికి వచ్చిన అడిషనల్ డీసీపీని స్థానికులు శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. గోదావరి నది ఒడ్డున ఉన్న అతి పురాతనమైన శివాలయం విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రెంజల్ ఎస్ఐ సాయన్న ఉన్నారు.



త్రివేణి సంగమ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి



వినాయక్‌నగర్‌లో ..





దుబ్బ శివారు ప్రాంతంలో కమ్మేసిన పొగమంచు

నగరాన్ని కమ్మేసిన పొగమంచు

పొగమంచు నగరాన్ని కమ్మేసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. 11 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రత పడిపోవడంతో చలితీవ్రత పెరుగుతూ శివారు ప్రాంతాలన్నీ పొగమంచుతో నిండిపోయాయి. ఉదయం 7.30 వరకు రహదారులు కనిపించ లేదు. వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పొగ మంచు కారణంగా శివారు ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగింది.

(స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్)



సాలీడు జాలిపై నీటి బిందువులు





పొగమంచులో వాకింగ్ చేస్తున్న దృశ్యం



హైదరాబాద్ రోడ్‌లో..



కాలువపై పొగమంచు

కస్తూర్బా విద్యాలయాల్లో
కుంటుపడిన విద్యా బోధన

మద్నూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బడి మానేసిన బాలికలకు ఉజ్వల భవిష్యత్తు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన కేజీబీవీలో విద్యా నైపుణ్య శిక్షణ అందించదానికి కృషి చేస్తున్న సిబ్బంది 23 రోజులుగా నిరవధిక సమ్మె కొనసాగిస్తుండడంతో జిల్లాలోని 19 బాలికల విద్యాలయాల్లో చదువుకుంటున్న 5577 మంది బాలికల విద్యా బోధన కుంటుపడుతుందని. తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు విధులకు హాజరు కాకుండా సమ్మె చేయడంతో విద్యార్థులు రాబోయే పరీక్షల్లో ఉత్తీర్ణత ఎలా సాధిస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. తమ సమస్యల సాధన కోసం సమగ్ర శిక్షా ఉద్యోగులు 23 రోజులుగా నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. కేజీబీవీలో, విద్యా వనరుల కేంద్రాల్లో పనిచేసే మెసెంజర్లు, డాటా ఆపరేటర్లు, ఎమ్మెస్ కోఆర్డినేటర్లు, పాఠశాల సముదాయంలో పనిచేసే సీఆర్పీలు, సిబ్బంది ఇలా జిల్లాలోని 725 మంది ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. కాంట్రాక్టు పద్ధతిలో నియామకమై సుమారు పదేళ్లుగా విద్యారంగంలో పనిచేస్తూ మెరుగైన విద్యా ప్రమాణాల కోసం సేవలందిస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ నిరవధిక సమ్మెకు పూనుకున్నారు. తమను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయడంతో పాటు తక్షణమే ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని ఎమ్మార్సీతో పాటు భవితా కేంద్రం మూసి ఉంటున్నాయి. అదేవిధంగా కేజీబీవీలో విద్యా బోధన సైతం కుంటుపడింది. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మూడు వారాలుగా పాఠాలు బోధించేవారు లేకపోవడంతో పేద విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైగా వార్షిక పరీక్షలు కూడా సమీపిస్తున్నాయి. సమ్మె ఎప్పుడు ముగుస్తుందో ఉద్యోగులు ఎప్పుడు విధులకు హాజరయ్యేది తెలియడం లేదు. దీంతో సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెతో పాఠశాలల్లోని విద్యార్థినుల్లో ఆందోళన పెరుగుతుంది. ఉద్యోగులు సమ్మెబాట పట్టడంతో డీఈవో, ఎంఈవోలు కేజీబీవీలను తరచుగా సందర్శించి విద్యార్థినులకు పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి ఉంది. ఎంఈవోలు కార్యాలయాలను వదిలి కేజీబీవీలోనే విధులు నిర్వహిస్తున్నారు. పేద విద్యార్థినుల ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వం ఇకనైనా సమగ్ర శిక్షా ఉద్యోగులతో చర్చలు జరిపి వారి సమస్యల పరిష్కారం చేసి విధులకు హాజరయ్యేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



మద్నూర్ కస్తూర్బా విద్యాలయంలో ఉపాధ్యాయులు లేక వెలవెలబోతున్న దృశ్యం

● న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి

సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె న్యాయమైనది. ఎన్నో ఏళ్లుగా విద్యా శాఖలో పనిచేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కేల్ అమలు చేయాలి. మా న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీని చిత్తశుద్ధితో అమలు చేయాలి. అప్పటి వరకు తమ సమ్మె కొనసాగుతుంది.

- సత్యనారాయణ, ఎస్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

బోధన్‌రూరల్, జనవరి2 (ఆంధ్రజ్యోతి): బోధన్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో బోధన్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుభరోసా పథకానికి నిబంధనలు విధిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నదాతకు సున్నం పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ రైతాంగాన్ని కడుపులో పెట్టుకొని కాపాడుకున్నారని కాంగ్రెస్ నాయకులు రైతాంగాన్ని కుదేలు చేస్తున్నారని అన్నారు. అలాగే బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లో బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, డీసీసీబీ డైరెక్టర్ గిర్ధావర్ గంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రావు దేశాయ్, తెలంగాణ శంకర్, మండలాల అధ్యక్షులు, తాజామాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'జిల్లాను అభివృద్ధి చేసిన ఘనత కవితకే దక్కుతుంది'

సుభాష్‌నగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకే దక్కుతుందని నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సంవత్సరం క్రితమే కేటాయించిన నిధులను రద్దు చేసి ప్రస్తుతం సంవత్సరం తర్వాత మేమే నిధులను తీసుకొచ్చామంటూ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కవిత ఎంపీగా ఉన్న సమయంలో అభివృద్ధి జరగలేదని అన్నారని కవిత ఎంపీగా ఉన్న సమయంలో అనేక అభివృద్ధి పనులు చేశారని అన్నారు. అనవసరంగా ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు.

సీఎంను, మంత్రిని కలిసిన రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు


సీఎంతో ట్రెసా ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి):నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, రాష్ట్రకార్యవర్గం, జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి తదితరులు సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎల్ఏ కమిషన్ నవీన్‌మిట్టల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన భూభారతి 2024 ఆర్ఓఆర్ చట్టానికి ట్రెసా సంపూర్ణ మద్దతు తెలుపుతుందని సమష్టిగా పనిచేస్తామని తెలిపారు. చట్టం అమల్లో ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామని ప్రకటించారు. ఎన్నికల బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని జీవో 317 వల్ల నష్టపోయిన ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని సీఎంను కోరారు.

జిల్లాను ముందంజలో నిలుపుదాం

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో జిల్లాను మరింత ప్రగతిపథంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పిలుపునిచ్చారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోను కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల బాధ్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు జిల్లా కలెక్టర్‌కు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. తాహెర్‌బిన్ హుందాన్ నేతృత్వంలో ఆఫీసర్స్ క్లబ్ కార్యవర్గం, రెడ్‌క్రాస్ సొసైటీ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, బ్రహ్మకుమారిలు, తదితరులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల కోసం దుప్పట్లు, నోటుబుక్స్ అందజేత..

నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చిన అధికార, అనధికార ప్రతినిధులు, వివిధ సంఘాల వారు అందించిన దుప్పట్లు, నోట్‌బుక్స్, ఎగ్జామ్ ప్యాడ్‌లను స్వీకరించిన కలెక్టర్ వాటిని సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు అందజేస్తామని తెలిపారు.

సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా నాయకులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాకు చెందిన నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యంరెడ్డి సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

డీఈవోను కలిసిన ట్రస్మా ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా ప్రైవేటు గుర్తింపు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) ప్రతినిధులు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌ను కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. పూలబుకేతో డిఈవోను సన్మానించారు. డీఈవోను కలిసిన వారిలో రాష్ట్ర అధికార ప్రతినిధి జయసింహాగౌడ్, జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, జిల్లా కార్యదర్శి అరుణ్, మధు, నర్సింహారావు, మోహన్, ధర్మరాజు, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

తొలిరోజు 'టెట్' ప్రశాంతం

నిజామాబాద్ అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్ (టెట్) పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పది రోజుల పాటు 20 సెషన్‌లలో కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9గంటల నుంచి 11.30ల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30ల వరకు రెండవ సెషన్ పరీక్షలు నిర్వహించనున్నారు. గురువారం మొదటి రోజు అర్సపల్లిలోని నాలెడ్జ్ పార్క్ స్కూల్‌లో నిర్వహించిన పరీక్షకు మొత్తం 150 మంది హాజరయ్యారు. క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ రోజు పరీక్షలేదు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో అశోక్ తెలిపారు.

ఇందల్వాయి ఎస్సైపై ఐజీకి ఫిర్యాదు

ఇందల్వాయి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డి.. ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్‌పై గురువారం మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మండలంలో అవినీతికి పాల్పడుతున్నాడని, మండల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. గౌరారం లింగాపూర్ వాగులో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను తన ఆధ్వర్యంలో నడుపుతున్నారని అన్నారు. ఇసుక ట్రాక్టర్ కేసుల విషయంలో అవినీతికి పాల్పడుతున్న ఎస్సై మనోజ్‌కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అంశంపై ఏకసభ్య కమిషన్ బహిరంగ విచారణ

● సమగ్ర నివేదిక సమర్పిస్తామని

జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ వెల్లడి


మాట్లాడుతున్న డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్, చిత్రంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, ఇతర అధికారులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల్లో ఉప వర్గీకరణపై వివరనాత్మక అధ్యాయనం కోసం రాష్ట్ర ప్రభుత్వంచే నియమించబడిన హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌తో కూడిన ఏకసభ్య కమిషన్ గురువారం కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ నిర్వహించారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల ప్రజాప్రతినిధులు, గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైద్యులు, న్యాయవాదులు, షెడ్యూల్డ్ కులాల సంఘాల నాయకులు, వివిధ వర్గాల వారి నుంచి వినతులు స్వీకరించి వర్గీకరణపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. మాలలు, మాదిగలు, జంగములు, చిందులు, బేడ, బుడగ జంగములు, బైండ్ల, మంగులతో పాటు వివిధ వర్గాల ప్రజాప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేస్తూ విజ్ఞాపలను అందజేశారు. బుడగజంగాలు, బైండ్ల, చిందులు, తదితరులు తాము కొనసాగుతున్న వృత్తులు బహిర్గతం అయ్యేలా, సంప్రదాయ వేషధారణలో తరలివచ్చి కమిషన్‌కు తమ స్థితిగతులను తెలియజేశారు. సామాజిక, ఆర్థిక వెనుకబాటు కారణంగా విద్య, ఉద్యోగాలు, తదితర రంగాలలో ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ప్రస్తావిస్తూ పలువురు వర్గీకరణ ఆవశ్యకతను నొక్కి చెప్పగా, వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని వర్గీకరణ పేరుతో ఎస్సీలను విభజించడం సబబు కాదని మరికొందరు కమిషన్‌కు తమ అభిప్రాయాలను తెలియజేశారు. బహిరంగ విచారణ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు నేతృత్వంలో జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేసింది. అభిప్రాయాలు వెల్లడించేందుకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏకసభ్య కమిషన్ డాక్టర్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశంపై అన్ని వర్గాల వారి అభిప్రాయాలను తెలుసుకొని క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమీషన్ ఇప్పటి వరకు నిజామాబాద్ ఉమ్మడి జిల్లాను కలుపుకొని తొమ్మిది జిల్లాలో తన పర్యటనను పూర్తి చేసుకుందని అందరి అభిప్రాయాలను సేకరించామన్నారు. వర్గీకరణ అంశంతో పాటు సామాజిక స్థితిగతులకు సంబంధించి షెడ్యూల్ కులాలకు చెందిన అన్ని వర్గాల వారు ఎలాంటి ఒత్తిడి లేకుండా నిర్భయంగా కమిషన్‌కు తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అన్ని ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి అందరి అభిప్రాయాలను సేకరించిన మీదట ప్రభుత్వానికి కమిషన్ సమగ్ర నివేదిక సమర్పిస్తుందన్నారు. అంతకుముందు ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల డిఎస్‌సిడివోలు నిర్మల, రజిత, తదితరులు స్వాగతం పలికారు. ఏకసభ్య కమిషన్ డాక్టర్ షమీమ్ అక్తర్ వెంట రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అదనపు సంచాలకులు శ్రీధర్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులు ఉన్నారు.


వివిధ కుల సంఘాల ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరిస్తున్న షమీమ్ అక్తర్, చిత్రంలో కలెక్టర్, అధికారులు

ఏకసభ్య కమిషన్‌కు వినతుల వెల్లువ

నిజామాబాద్ అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుపై అధ్యాయనానికి జిల్లా కేంద్రానికి వచ్చిన ఏకసభ్య కమిషన్‌కు అనేక సంఘాల ప్రతినిధులు వినతిపత్రాలు అందజేశారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన బహిరంగ విచారణకు వివిధ సంఘాల ప్రతినిధులు వచ్చి తమ విజ్ఞాపలను అందజేశారు. దీంతో కలెక్టరేట్ ప్రాంగణమంతా సందడిగా మారింది. హోలియదాసరి కళాకారులు వేషధారణలో వచ్చి తమకు వయోపరిమితి లేకుండా పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే సుప్రీం కోర్టు సూచనల మేరకు తమను ఎస్సీలలో ఏగ్రూప్‌లో చేర్చి 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని బేడ బుడగజంగాల సంక్షేమ సంఘం కామారెడ్డి ప్రతినిధులు కమిషన్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు బుర్రకథ చెబుతూ తమ సమస్యను విన్నవించారు. ఎస్సీ రిజర్వేషన్లను 59వ షెడ్యూల్ కులాలకు వారి వారి జనాభా నిష్పత్తి ప్రకారం వర్గీకరించాలని ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో కమిషన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ దళితులలో భాగమైన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మోచీలకు ఎస్సీ వర్గీకరణలో అవకాశం ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర మోచీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముత్యం, కార్యదర్శి సుధాకర్ తదితరులు కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు.

నగరంలో షాపింగ్ మాల్స్ తనిఖీ

సుభాష్‌నగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ షాపింగ్ మాల్స్‌ను నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ తనిఖీలు నిర్వహించారు. నగరంలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్, చెన్నై షాపింగ్ మాల్స్‌లలో తనిఖీ చేపట్టారు. షాపింగ్‌మాల్ ప్రాపర్టీ టాక్స్ సరిగా కడుతున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. ట్రేడ్ లైసెన్స్ వివరాలను తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు ప్రాపర్టీ టాక్స్‌ను, ట్రేడ్ లైసెన్స్ చెల్లించాలని, నేటి నుంచి నిరవధికంగా తనిఖీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

శబరిమలైకి అన్నదాన వాహనం

● నిత్యావసర వస్తువులను పంపించిన

ఇందూరు అయ్యప్ప సేవా సమితి

నిజామాబాద్ కల్చరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): శబరిమలలో నిర్వహించే అన్నదానానికి సంబంధించిన వాహనాన్ని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఇందూరు నగర శాఖ ఆధ్వర్యంలో ఈ వాహనం నాందేవ్‌వాడ ఛత్రపతి హనుమాన్ ఆలయం నుంచి బయలుదేరింది. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శబరిమలలోని నెలకల్ ప్రాంతంలో జనవరి 7 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే మహా అన్నదాన కార్యక్రమానికి ఈ బియ్యాన్ని, పంప్పుదినుసులను వినియోగిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. సుమారు 9లక్షల విలువైన వంట సామగ్రిని పంపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశ్‌రెడ్డి, ఆగమయ్య గురుస్వామి, గంగరత్నం గురు స్వామి, రవి స్వామి, పార్శిరాజ్ స్వామి, శ్రీనివాస్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెద్దరాంమందిర్ భూముల సర్వే

నిజామాబాద్ కల్చరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ పరిధిలోని పెద్దరాం మందిర్ భూములను గురువారం దేవాదాయ శాఖ అధికారులు సర్వేయర్‌తో సర్వే చేయించారు. ఇన్‌చార్జి సహాయ కమిషనర్ శ్రీరాంరవీందర్ గుప్త సమక్షంలో నిర్వహించిన సర్వేలో పెద్దరాం మందిర్‌కు సంబంధించిన న్యాల్‌కల్ రోడ్‌లోని భూములను సర్వే చేశారు. ఈ సర్వేలో సీనియర్ అసిస్టెంట్ కమల, ఆలయ ఈవో వేణు, జూనియర్ అసిస్టెంట్లు ప్రశాంత్, రఘు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.160	రూ.275	రూ. 295
వెన్‌కాబ్ (కిలో)	రూ.165	రూ.280	రూ. 300

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్ (10 గ్రా.)	వెండి (10 గ్రా.)
రూ.79500	రూ.73350	రూ.920

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1 : పుష్ప-2 (10.20, 2.45)
: మార్కో (7.10)
: ముఫాసా (ఇంగ్లీష్ 3డి) (10.15)
స్ర్కీన్-2 : ముఫాసా (తెలుగు 3డి) (11.00, 1.50, 4.40, 7.30)
: పుష్ప-2 (10.20)
స్ర్కీన్-3 : మార్కో (11.05)
:పుష్ప-2(హింది) (2.10):పుష్ప-2(తెలుగు) (6.15)
: బేబిజాన్ (హిందీ) (10.40)
స్ర్కీన్-4 : కార్వన్ ది హంటర్ (ఇంగ్లీష్) (11.00, 5.00)
: మార్కో (1.55, 10.50) : కార్వన్ ది హంటర్ (తెలుగు) (7.55)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : మ్యాక్స్ (10.25, 1.20, 10.30)
: మార్కో (4.10)
: పుష్ప-2 (7.00)
స్ర్కీన్-2 : ముఫాసా (1.20)
: పుష్ప-2 (3.50)
: మార్కో (7.45, 10.30)
స్ర్కీన్-3 : ముఫాసా (తెలుగు 3డి) (10.50, 5.05, 7.30)
: పుష్ప-2 (1.10, 9.55)

దేవి: మార్కో (11.00, 2.00, 6.00, 9.00)
నటరాజ్: మ్యాక్స్ (2.00, 9.00)
: కార్వన్ ది హంటర్ (11.00, 6.00)
విజయ్ : పుష్ప-2 (10.00, 2.00, 6.00, 10.00)
లలితామహల్: యుఐ (11.00, 2.00, 6.00, 9.00)

- నిజామాబాద్ అర్బన్